St
1
Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 325 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 22 నవంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 325 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 22 November 2025 PAGES : 8 PRICE : 3/-

## యుద్ధ ట్యాంకులకు 'యమపాశం జావెలిన్'



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 21)

మారుతున్న భద్రతా పరిస్థితుల దృష్ట్యా వేగంగా సైనిక బలగాలను ఆధునికీకరిస్తున్న భారత్ మరిన్ని ఆయుధ వ్యవస్థలను సమకూర్చుకునేందుకు సిద్ధమవుతోంది. ట్యాంకుల పాలిట సింహస్వప్నంగా నిలిచే జావెలిన్ క్షిపణి వ్యవస్థను మన దేశానికి విక్రయించేందుకు అమెరికా సిద్ధమైంది. ఇది మన సైనికుల పోరాట సామర్థ్యాన్ని మరింత రాటుదేలుస్తుంది. యుద్ధరంగంలో వారిని సురక్షితంగా ఉంచడానికి ఇది దోహదపడుతుంది.

ఏమిటీ జావెలిన్?

ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వినియోగమవుతున్న ఆధునిక ట్యాంకు విధ్వంసక క్షిపణుల్లో జావెలిన్ ఒకటి. దీన్ని అమెరికాకు చెందిన రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు సంయుక్తంగా ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ అస్త్రాన్ని ప్రయోగించడానికి భారీ లాంఛ్ వ్యవస్థలు అవసరంలేదు. సైనికుడి భుజంపైనుంచి సులువుగా ప్రయోగించవచ్చు. ఇది 'ఫైర్ అండ్ ఫర్గెట్' ఆయుధం. అంటే.. లక్ష్యాన్ని నిర్దేశిస్తే దాన్ని వేటాడే పనిని ఈ క్షిపణి చూసుకుంటుంది. ఇందులో పరారుణ సీకర్ ఉంటుంది. ప్రయోగానికి ముందే దీన్ని లక్ష్యంతో 'లాక్-ఆన్' చేయవచ్చు. ప్రయోగానంతరం.. ఈ క్షిపణి.. లక్ష్యం దిశగా సొంతంగా మార్గనిర్దేశం చేసుకుంటుంది. ఫలితంగా సైనికుడిపై భారం తగ్గుతుంది. ఈలోగా అతడు.. తానున్న ప్రదేశాన్ని ప్రత్యర్థి గుర్తించకుండా వేరేచోటుకు వెళ్లిపోవచ్చు. లేదా మరో క్షిపణిని లోడ్ చేసుకొని ఇంకో లక్ష్యం వైపు గురిపెట్టవచ్చు.

## ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యే.. సీఎం మార్పుపై ప్రచారానికి డీకే శివకుమార్ తెర

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 21)

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకత్వ మార్పు ప్రచారానికి ఎట్టకేలకు తెరపడింది. ముఖ్యమంత్రిగా ఐదేళ్లూ సిద్ధరామయ్యే కొనసాగుతారని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. తామంతా ఆయనకు సహకరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్' పోస్ట్‌తో క్లారిటీ



ఇచ్చారు. "మొత్తం 140 మంది శాసనసభ్యులు నా ఎమ్మెల్యేలే. గ్రూప్‌లు కట్టడం నా రక్తంలోనే లేదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సీఎం నిర్ణయించారు. మంత్రి కావాలని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. ఈ క్రమంలోనే దిల్లీలోని హైకమాండ్‌తో వారు సమావేశం అవడం సాధారణమే. అది వారు హక్కు కూడా..! అధిష్ఠానం వద్దకు వెళ్లొద్దని -మిగతా 2లో

## కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి: సీఎం చంద్రబాబుకు జగన్ లేఖ

ఏపీ ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి

ట్రైబ్యునల్ ముందు ప్రభుత్వ వాదనలు బలహీనంగా ఉన్నాయని విమర్శ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 21)


కృష్ణా నదీ జలాల వివాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైసీపీ అధినేత జగన్ లేఖ రాశారు. కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్ ముందు త్వరలో జరగనున్న విచారణలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిలో 763 టీఎంసీల నీటిని తమ రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని జగన్ ప్రస్తావించారు. ట్రైబ్యునల్ ఈ డిమాండ్‌కు అంగీకరిస్తే ఆంధ్రప్రదేశ్‌కు -మిగతా 2లో

# వైద్యారోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష..

## సంజీవని ప్రాజెక్టు అమలుపై ప్రణాళికలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 21)

వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌పై చర్చించారు. సంజీవని ప్రాజెక్టును జనవరి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలివిడతలో చేపట్టనున్న ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల మెడికల్ కాలేజీల నిర్మాణంపై కూడా చర్చించారు. విద్యార్థులు, ప్రజలు, సామాజిక ప్రయోజనం కోసం వీటిని ప్రభుత్వం పీపీపీ ప్రాతిపదికన నిర్మిస్తోంది. దీంతో బోధనాసుపత్రులు వేగంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.ఆక్వా రంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా తీర్చిదిద్దడమే లక్ష్యంప్రపంచ మత్స్య దినోత్సవం -మిగతా 2లో





## నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి.. అధికారుల అప్రమత్తతతో తగ్గిన నష్టం: గొట్టిపాటి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 21)

పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి పడిన ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అధికారులు అప్రమత్తమై నష్టాన్ని గణనీయంగా తగ్గించారని పేర్కొన్నారు. గండిని పూడ్చేయటంతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇకపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు -మిగతా 2లో

## మమత లేఖ.. ఎక్స్ వేదికగా అమిత్‌షా కౌంటర్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 21)

కొన్ని రాష్ట్రాలు చొరబాటుదారుల్ని రక్షించే ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిలిపివేయాలంటూ వస్తోన్న డిమాండ్ల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "చొరబాటుదారుల్ని అడ్డుకోవడం దేశ భద్రతకు ఎంతో కీలకం. అంతేగాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు ఆ చొరబాట్లను నిరోధించాల్సిన అవసరం ఉంది. కొన్ని రాజకీయ పార్టీలు -మిగతా 2లో

## సభాహక్కుల కమిటీకి జగన్ మీడియా ఎందుకు భయపడుతోంది



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 21)

సభాహక్కుల కమిటీకి జగన్ మీడియా ఎందుకు భయపడుతోందని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. తప్పుడు వార్తలు రాసి.. ఇప్పుడు ప్రొసీడింగ్స్‌ను అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. సాక్షిలో తప్పుడు వార్తలపై అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వొచ్చన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతుల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారంటూ శాసనసభ, సభాపతిని చులకన చేసేలా సాక్షిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరయ్యే సమయంలో జగన్ బలప్రదర్శన చేసిన తీరును యనమల తప్పుబట్టారు. -మిగతా 2లో

## జగన్ పాలనలో రైతుకు దగా... ఇప్పుడు ఈ కొత్త కార్యక్రమంతో లాభాల బాట: మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి

రైతుల సంక్షేమం కోసం 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం

నవంబర్ 24 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు 'పంచ సూత్రాల' రూపకల్పన

గత ప్రభుత్వ హయాంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 21)

సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్‌తో రైతు ఆదాయం రెట్టింపు లక్ష్యం ఆంధ్రప్రదేశ్‌లో రైతుల జీవితాలకు కొత్త దిశ చూపి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో 'రైతన్నా.. మీకోసం' అనే బృహత్తర కార్యక్రమాన్ని ఈ నెల 24 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. రైతును రాజుగా చూడాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. -మిగతా 2లో

## శాంతిపురంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన నారా భువనేశ్వరి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 21)

సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. శాంతిపురం మండలం శివపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో స్థానిక ప్రజల నుంచి -మిగతా 2లో


## గూగుల్ కోసం శరవేగంగా భూసేకరణ

ఎకరానికి రూ.40 లక్షల వరకు పరిహారం, 20 సెంట్ల భూమి

ప్రభుత్వం పరిహారం పెంచడంతో స్వచ్ఛందంగా ముందుకొస్తున్న రైతులు

ఇప్పటికే 60 శాతం మందికి పైగా అంగీకారం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 21)



గూగుల్‌కు భూములు ఇచ్చేందుకు ఆమోదపత్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అందిస్తున్న ఆనందపురం వైకాపా ఎంపీపీ తండ్రి మజ్జి వెంకట్రావు, తదితరులు, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలంలోని తర్లువాడలో భూసేకరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ప్రభుత్వం అక్కడి భూముల రిజిస్ట్రేషన్ విలువ రూ.20 లక్షలకు పెంచి, రైతులకు ఎక్కువ మొత్తం పరిహారం వచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిస్తున్నారు. భూమిలివ్వకుండా అడ్డంకులు సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నప్పటికీ వాటిని లెక్క చేయకుండా ఇప్పటికే 60 శాతం మందికి పైగా రైతులు అంగీకార పత్రాలు అందజేశారు. భూములిస్తున్నవారికి ప్రభుత్వం తాజాగా పెంచిన ప్రయోజనాల గురించి వివరించేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విశాఖపట్నంలోని సర్క్యూట్‌హౌస్‌లో గురువారం నిర్వహించిన సమావేశానికి -మిగతా 2లో

# వైద్యారోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష..

సందర్భంగా మత్స్యకార సోదరులకు, ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ సముద్ర తీరం, డెల్టా ప్రాంతం, సరస్సులు, రిజర్వాయర్లు మనల్ని బ్లూ ఎకానమీలో దేశంలోనే ముందు నిలిపాయని గుర్తుచేశారు. రాష్ట్ర జీఎస్డీపీలోనూ మత్స్య రంగానిదే అగ్ర వాటా అని పేర్కొన్నారు దీనికి మరింత మద్దతిచ్చేలా మత్స్యకారులకు, ఆక్వారైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వెల్లడించారు. వేట నిషేధ సమయంలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు ఆర్థిక సాయంగా ఇచ్చినట్లు తెలిపారు. గంగపుత్రులు కోరుకున్నట్టుగా 217 జీవో రద్దు చేసి సొసైటీలకే హక్కు కల్పించినట్లు వివరించారు. ఆక్వా రంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## శాంతిపురంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన నారా భువనేశ్వరి

వినతులు స్వీకరించారు. సమస్యలతో వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ మూడో రోజు శాంతిపురం మండలంలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పలువురు తెదేపా నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గూగుల్ కోసం శరవేగంగా భూసేకరణ

రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైకాపా ఎంపీపీ మజ్జి శారద తండ్రి, తర్లువాడ మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు కూడా సమావేశానికి హాజరై ఆమోదపత్రం అందజేయడం విశేషం. భూములిచ్చిన రైతుల ఖాతాల్లో శనివారం నుంచి పరిహారం మొత్తాన్ని ప్రభుత్వం జమ చేయనుంది. రైతుల డిమాండ్లకు అంగీకారం: ప్రభుత్వం గూగుల్ కోసం 308.657 ఎకరాల్ని కేటాయిస్తోంది. ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో ఈ భూములు సేకరించి గూగుల్‌కు కేటాయించబోతున్నారు. వాటిలో 204 ఎకరాల వరకు డీపట్టా, శివాయ్ జమేదార్, రికార్డుల్లోకి ఎక్కని శివాయ్ జమేదార్ భూములున్నాయి. అక్కడ భూముల రిజిస్ట్రేషన్ విలువను డీ పట్టా భూములకు ఎకరానికి రూ.17 లక్షలు, రికార్డుల్లోకి ఎక్కని శివాయ్ జమేదార్ భూములకు ఎకరానికి రూ.8.5 లక్షలుగా తొలుత నిర్ణయించారు. తాజాగా రైతుల డిమాండ్ మేరకు డీ పట్టా భూముల రిజిస్ట్రేషన్ విలువ ఎకరానికి రూ.20 లక్షలకు, రికార్డుల్లోకి ఎక్కని శివాయ్ జమేదార్ భూములకు ఎకరానికి రూ.10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. అయితే తమ భూమికి ఎకరానికి 20 సెంట్ల చొప్పున తర్లువాడ సమీపంలోనే భూమి కేటాయించాలని, మిగతా భూమికి పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. దానికి కూడా ప్రభుత్వం అంగీకరించింది. అంటే ఎకరం భూమి ఇచ్చిన రైతుకు 80 సెంట్లకు పరిహారం చెల్లించి, 20 సెంట్ల భూమి కేటాయిస్తారు.

## జగన్ పాలనలో రైతుకు దగా... ఇప్పుడు ఈ కొత్త కార్యక్రమంతో లాభాల బాట: మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి

"వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, దాన్ని శాశ్వతంగా లాభసాటిగా మార్చడం ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనత. కేవలం మాటలతో కాకుండా, ఇజ్రాయల్ టెక్నాలజీని అందించి ఉత్పత్తిని పెంచిన ఘనత ఆయనది. ఇప్పుడు అదే స్ఫూర్తితో వ్యవసాయాన్ని గౌరవప్రదమైన వృత్తిగా మార్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం" అని వివరించారు.

**గత ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు**

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. "జగన్ రెడ్డి పాలనలో విత్తనం నుంచి పంట విక్రయం వరకు ప్రతీ

### మొదటి పేజీ తరువాయి

దశలోనూ రైతులను దగా చేశారు. ఆయన హయాంలో వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితి కల్పించారు. అమ్ముకున్న పంటకు కూడా డబ్బులు చెల్లించలేని దుస్థితిని సృష్టించారు. రైతు ద్రోహి అయిన జగన్ రెడ్డి ఎగ్గొట్టిన రూ. 1,674 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించింది. డ్రిప్, మైక్రో ఇరిగేషన్ వంటి పథకాలను అటకెక్కించి రైతాంగాన్ని అయోమయంలోకి నెట్టారు" అని ఆయన విమర్శించారు.

**వ్యవసాయ నవశకానికి 'పంచ సూత్రాలు'**

రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపి, వ్యవసాయ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల'ను రూపొందించిందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆ సూత్రాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

1. నీటి భద్రత: ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయడం, భూగర్భ జలాలను రైతులకు అందుబాటులోకి తేవడంపై దృష్టి పెడతాం. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించి నీటి ఆదాతో పాటు దిగుబడి పెంచుతాం.
2. డిమాండ్ ఆధారిత పంటలు: మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, డిమాండ్ ఉన్న పంటలను పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తాం. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ధర, రెట్టింపు లాభం సాధించవచ్చు.
3. అగ్రిటెక్ వినియోగం: వ్యవసాయంలో డ్రోన్లు, ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచుతాం. భూసార పరీక్షల ఆధారంగా శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహించి రైతు శ్రమను తగ్గించి, నాణ్యతను పెంచుతాం.
4. ఫుడ్ ప్రాసెసింగ్: పంటలకు విలువ జోడించడం ద్వారా రైతుకు రెట్టింపు ఆదాయం కల్పిస్తాం. మామిడిని పల్ప్‌గా, మిర్చిని పొడిగా మార్చే ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించడం ద్వారా స్థిరమైన ఆదాయానికి బాటలు వేస్తాం.
5. ప్రభుత్వ మద్దతు: కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించి పంటలను కొనుగోలు చేస్తాం. మార్కెట్‌లో ధరలు పడిపోయినప్పుడు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇప్పటికే 'అన్నదాత సుఖీభవ ప్లస్ పీఎం కిసాన్' కింద 46.85 లక్షల మంది రైతులకు రూ. 6,310 కోట్లు జమ చేశాం.

నవంబర్ 24 నుంచి 29 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, రైతు జీవితంలో ఒక విప్లవమని, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ వ్యవసాయం స్వర్ణయుగంలోకి అడుగుపెడుతోందని శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## సభాహక్కుల కమిటీకి జగన్ మీడియా ఎందుకు భయపడుతోంది

"కోర్టుకు హాజరు కావాలంటే, నేరస్థుడిగా ఆరోపించబడిన వ్యక్తి ప్రజలకు ఇబ్బంది కలిగించాల్సిన అవసరం లేదు. ఆయన చర్యలు న్యాయస్థానాన్ని బెదిరించేలా ఉన్నాయి. 2029లో జగన్ అధికారం చేపట్టి ప్రజల ఆస్తులను దోచుకుంటాడు అన్నట్లుగా ఆయన అనుచరుల నినాదాలు ఉన్నాయి" అని యనమల అన్నారు.

## మమత లేఖ.. ఎక్స్ వేదికగా అమిత్‌షా కౌంటర్

వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందుకే ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్నాయి" అని అమిత్ షా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే ఇక్కడ ఏ పార్టీ, రాష్ట్రం పేరును ఆయన ప్రస్తావించలేదు. కానీ.. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు లేఖ రాసిన నేపథ్యంలోనే భాజపా అగ్రనేత నుంచి స్పందన రావడం గమనార్హం.ఇక తాను రాసిన లేఖలో ఎస్ఐఆర్ గురించి మమత విమర్శలు చేశారు. ఆ సవరణ తమ రాష్ట్రంలో అరాచకంగా, బలవంతంగా, ప్రమాదకరంగా సాగుతోందని ఆరోపించారు. కనీస సన్నద్ధత, తగినంత ప్రణాళిక, స్పష్టమైన సమాచారం లేకుండా ఎన్నికల సంఘం అధికారులు, పౌరులపై ఎస్ఐఆర్ రుద్దుతోందన్నారు. బూత్ స్థాయి అధికారులు పని వేళల్లో ఓటర్లను కలవడం అసాధ్యమని, ఈ కసరత్తు అత్యంత బలహీన ప్రాతిపదికన సాగుతోందనడానికి ఇది నిదర్శనమని మమత తెలిపారు. ఎస్ఐఆర్‌లో పాల్గొంటున్న అధికారులు అసాధారణ పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ లేఖపై భాజపా స్పందించింది. మోసపూరితంగా సృష్టించుకున్న ఓటు బ్యాంకును కాపాడుకోవడానికే మమత ఆరాట పడుతున్నారని, నాటకీయతకు దిగుతున్నారని దుయ్యబట్టింది.

## నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి.. అధికారుల అప్రమత్తతతో తగ్గిన నష్టం: గొట్టిపాటి

గురువారం అర్ధరాత్రి గండి పడింది. ఎస్కేప్ ఛానల్ వద్ద కట్టకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగింది. దీంతో వాగు పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు. ఈక్రమంలో అధికారులు అప్రమత్తమై శుక్రవారం ఉదయం గండిని పూడ్చారు.

## కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి: సీఎం చంద్రబాబుకు జగన్ లేఖ

తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన తుది వాదనలను బలంగా వినిపించి, ఏపీకి జరగబోయే నష్టాన్ని నివారించాలని సూచించారు.ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడటంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని జగన్ ఆరోపించారు. "ప్రభుత్వం ట్రైబ్యునల్ ముందు బలహీనమైన వాదనలు వినిపిస్తోంది. రాయలసీమ ప్రాజెక్టుల విషయంలోనూ ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉంది" అని లేఖలో పేర్కొన్నారు.ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.16 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచేందుకు అవసరమైన భూసేకరణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతులు ఇవ్వడాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వ వైఖరి సరిగా లేకపోవడం వల్లే పొరుగు రాష్ట్రాలు ఏపీకి నష్టం కలిగించే చర్యలు తీసుకుంటున్నాయని విమర్శించారు.1996లో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచే పనులు మొదలయ్యాయని, అప్పుడు రైతులు, ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేసినా ఆయన పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఆల్మట్టి ఎత్తు పెంపునకు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ అనుమతి ఇచ్చిందని, 2014లో కూడా టీడీపీ ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు వదులుకుందని ఆరోపించారు."ఈ కీలక తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించి, కృష్ణా జలాలపై మన హక్కులను కాపాడాలి. బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీల నికర జలాల్లో ఒక్క టీఎంసీ తగ్గినా, అందుకు టీడీపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని జగన్ తన లేఖలో స్పష్టం చేశారు.

## ఐదేళ్లూ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యే.. సీఎం మార్పుపై ప్రచారానికి డీకే శివకుమార్ తెర

మేం వారిని ఆపలేం కదా..! ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సీఎం చెప్పారు. ఆయనకు మేమంతా అభినందనలు తెలియజేస్తున్నాం. ఆయనతో కలిసి పనిచేస్తాం. సీఎం అయినా.. నేనైనా పదే పదే చెప్పేది ఒక్కటే.. హైకమాండ్ ఆదేశాలకు మేం కట్టుబడి ఉంటాం" అని డీకే శివకుమార్ తన పోస్టులో రాసుకొచ్చారు.

2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్.. గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. గురువారంతో సిద్ధరామయ్య నేతృత్వంలోని సర్కారుకు రెండున్నరేళ్లు నిండాయి. దీంతో రాజకీయం వేడెక్కింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మద్దతుదారులు ఒక్కొక్కరుగా దిల్లీకి వెళ్లడంతో ఈ ప్రచారం మరింత జోరందుకుంది. సీఎంగా శివకుమార్‌ను పగ్గాలు ఇవ్వాలని ఆయన మద్దతుదారులు హైకమాండ్‌ను అభ్యర్థించినట్లు కూడా వార్తలు వచ్చాయి.అయితే, అధికార పంపిణీ అంశాన్ని మొదటి నుంచీ తోసిపుచ్చుతున్న సిద్ధరామయ్య.. ఐదేళ్లూ తానే సీఎంగా ఉంటానని పలుమార్లు బహిరంగంగానే చెప్పారు. ఎమ్మెల్యేల్లో అత్యధికుల మద్దతు తనకే ఉందని అన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల దిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య.. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో వేర్వేరుగా సమావేశమై మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. క్యాబినెట్‌లో మార్పులు చేస్తే అసంతృప్తులను బుజ్జగించొచ్చని సీఎం భావించారు. ఇందుకు హైకమాండ్ నుంచి కూడా అంగీకారం లభించినట్లు సమాచారం.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సతీమణి కందుల వసంతలక్ష్మి







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, నవంబర్ 21)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి మార్కాపురం పట్టణంలో సీఎం సహాయనిది చెక్కులను శుక్రవారం స్వయంగా వారి ఇండ్లకు వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం వారి బాగోగులు అడిగి తెలుసుకొన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు పొందిన వారిలో మార్కాపురం టౌన్‌లో సాంబతూరు ప్రసాదరావుకి రూ.42,881, కొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డికి రూ.47,450, గ్రందే రామ సుబ్బారావుకి రూ.27,000, దూదేకుల పెద్ద కాసింకి రూ.68,415, కొల్లి వెంకటయ్యకి రూ.43,092, వంగూరి ప్రసాదరావుకి రూ.41,084, షేక్ మహమ్మద్ అయాన్‌కి రూ.35,681, కోలా కుమారికి రూ.27,114, షేక్ రహమత్ బికి రూ.25,541లు వెరసి రూ.3,58,258ల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# అనధికారకంగా నిర్మించిన భవనాలు తప్పనిసరిగా క్రమబద్దీకరించుకోవాలి

## నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు శుక్రవారం సాయంత్రం నగరంలోని అందరూ ఎల్‌టీపీలు , పట్టణ ప్రణాళిక సిబ్బందితో నగరపాలక సంస్థ ఛాంబర్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల కోసం తీసుకువచ్చిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీంల గురించి చర్చించారు. ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ మాట్లాడుతూ అందరూ ఎల్‌టీపీలు అందరూ కూడా వారి దగ్గరకి వచ్చిన దరఖాస్తుదారులకి ఈబీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీంల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి డీవియేషన్ భవనం అనధికారకంగా నిర్మించిన భవనములు అన్ని తప్పనిసరిగా క్రమబద్దీకరించుకోవాలి అని తెలిపారు. అందువలన బీపీఎస్‌లోనికి వచ్చిన ప్రతి భవనం యొక్క మార్ట్ గేజ్ ను రిలీజ్ చేయబడును. సదరు భావనములకు ప్రాపర్టీ టాక్స్ తగ్గించబడును. కావున సదరు బీపీఎస్ చేయించుకోమని సదరు భావనములకు వాటర్ సప్లై కనెక్షన్స్ తొలగించి, ఆయా భావన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును అని తెలిపారు. బీపీఎస్ స్కీం ఉపయోగములలో ముఖ్యంగా బిల్డింగ్స్ కి 10% డీవియేషన్ లోపల వాటికి ప్రాపర్టీ టాక్స్ 10 శాతం అధికంగా ప్రాపర్టీ టాక్స్ వేయడం జరుగుతోంది అని తెలిపారు. అలానే 10% డీవియేషన్ పైన ఉన్న బిల్డింగ్స్ కి 50% అధికముగా ప్రాపర్టీ టాక్స్ వేయడం జరుగుతోంది అని తెలిపారు. బీపీఎస్‌ల అందరూ కూడా వారు ఇప్పటికీ వరకు ఇచ్చినా ప్లాన్స్ యొక్క యాజమానులకు ఈ స్కీమ్ గురించి తప్పనిసరిగా తెలియచేయావలసినిదిగ సూచించారు. బీపీఎస్ స్కీం కి చివరి తేదీ 11 మార్చ్ 2026 న నిర్ణయించటం జరిగినది అని తెలిపారు. నగరపాలక సంస్థకి ఈ బీపీఎస్ స్కీం సుమారు 70 కోట్లు రూపాయలు ఆదాయం వస్తోంది అని అంచనా వేస్తున్నాము అని కమీషనర్ ద్వారా తెలిపారు. అలానే బీపీఎస్ స్కీం ద్వారా అనధికార లేఔట్లను అధికారిక లేఔట్లుగా మార్చుకోవచ్చు అని తెలిపారు. ఇప్పటికే ఒంగోలు నగరంలో అనధికార లేఔట్‌లో డ్రైనేజీ, విద్యుతు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించటం జరగదు అని ప్రజలలో అవగాహన కల్పించి ఈ బీపీఎస్‌స్కీంలో అప్లై చేసి వాటిని ఆమోదం చేసుకొనుట వలన ఆయా లేఔట్లలో మౌలిక సదుపాయములు కల్పించటం జరుగుతుంది అని కమీషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ బీపీఎస్ స్కీం ద్వారా ఒంగోలు నగర పాలక సంస్థ కు సుమారు రూ.30 కోట్లు ఆదాయం సమకూరుతోంది అని తెలిపారు. బీపీఎస్ స్కీం లో అప్లై చేసుకొనుటకు 26.01.2026న చివరి తేదీ కనుక అందరు ఎల్‌టీపీలు ఒంగోలు నగరపాలక సంస్థ సహకరించవలసినదిగా కమీషనర్ కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ రామ్ భూపాల్ రెడ్డి, ఏసీపీ సుధాకర్‌రావు, టీపీవో బాబురావు, టీపీఎస్ రసూల్, రెవిన్యూ ఆఫీసర్ విజయభాస్కర్, ఆర్ఐలు, నగరంలోని ఎల్‌టీపీలు పాల్గొన్నారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# మత్స్య సంబంధ కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి


## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

రాష్ట్రానికి కీలక ఆదాయ వనరుగా మత్స్య సంబంధ కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రపంచ మత్స్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఘనంగా జరిగాయి. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, స్థానిక శాసనసభ్యులు .దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు జి.పేరయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఆర్. వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్య ఆదాయం ఆర్జనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆక్వా కల్చర్ లో ఒక్కో యూనిట్ రూ.1.5 చొప్పున విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇసన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఉప్పాడలో మత్స్యకారుల ఆందోళనను పరిగణలోకి తీసుకుని వారి భూములను ప్ర భు ం త్వ ం
వె న క్కి




ఇచ్చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మత్స్యకారులకు పిలుపునిచ్చారు. ఆక్వా రంగంలో మరింత మంది అధ్యయనం చేసేలా కాలేజీలలో వినూత్న కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి ఉన్న విశాల తీరప్రాంతాన్ని ఆదాయంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు తమ ఆదాయం పెంచుకునేందుకు ఉత్తమ విధానాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తీర ప్రాంతం వెంట చేపట్టిన పర్యాటక, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో ధరలను కూడా మత్స్యకారుల సమక్షంలోనే ఖరారు చేశామని గుర్తు చేశారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక కట్టుబాటుకు మత్స్యకారులు ప్రతిరూపంగా ఉంటున్నట్లు చెప్పారు. వేట నిషేధ సమయంలోనూ, ఇతర విపత్తులలోనూ ఈ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు తాజాగా వచ్చిన మొంథా తుఫాన్ సమయంలోనూ మరిన్ని నిత్యవసర సరుకులను ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బాధితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచడాన్ని ఆయన ప్రస్తావించారు. పల్లెపాలెంలో (తరువాయి 4లో...)

# క్రమశిక్షణ ఉల్లంఘించిన ఇద్దరు హెూమ్ గార్డులను విధుల నుండి తాత్కాలికంగా నిలిపివేసిన ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

## పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే వారి పై నిబంధనలు ప్రకారం చర్యలు తప్పవు

## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

ప్రకాశం జిల్లాలో సాగే సాగర్ కవచ్ బందోబస్తు కార్యక్రమం నేపథ్యంలో ఒంగోలుకు విధి నిర్వహణ కోసం వచ్చిన పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌కు చెందిన హెూమ్ గార్డ్ షేక్ యాసిన్, దోర్నాల పిఎస్‌కి చెందిన తంగిరాల ప్రశాంత్ కుమార్, వెలిగండ్ల పిఎస్‌కి చెందిన చెరుకూరి బాల సుబ్రహ్మణ్యం ముగ్గురు 19.11.2025 రాత్రి ఒంగోలులోని అన్నపూర్ణ లాడ్జ్‌లో విశ్రాంతి కోసం గదిని తీసుకున్నారు. అనంతరం ముగ్గురు కలసి మద్యం తాగి, సిగిరెట్ కాల్చే సమయంలో ప్రశాంత్ కుమార్, బాల సుబ్రహ్మణ్యం ఇద్దరి మధ్య వాగ్వాదం ఏర్పడి, పరస్పరం తోసి వేసుకోవడం, చేతులతో కొట్టుకునే సంఘటన చోటుచేసుకుంది. గొడవ సమయంలో, బాల సుబ్రహ్మణ్యం కిందపడటం వల్ల తలకు గాయమైనది. ఈ విషయం తెలుసుకున్న ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, వెంటనే అధికారులను విచారణకు ఆదేశించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు క్రమశిక్షణను పాటించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేస్తూ, ఈ ఘటనపై సమగ్ర రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. ప్రాథమికంగా ముగ్గురు హెూం గార్డులను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు పిలిపించి విచారణ కొనసాగుతోంది. ప్రశాంత్ కుమార్, బాల సుబ్రహ్మణ్యంలను విధుల నుండి తాత్కాలికంగా నిలిపివేయటం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై పూర్తి విచారణ కొనసాగుతుందన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది, హెూమ్ గార్డులు సహా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించే సమయంలో క్రమశిక్షణ, ప్రవర్తనా నియమాలను కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా, శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించినా, వారిపై చర్యలు తీసుకుంటామని, హెూమ్ గార్డులు కూడా పోలీస్ వ్యవస్థలో ఒక భాగమనే జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# పార్టీ నాయకుని పాడె మోసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 21)

తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుడు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి గెలుపు కోసం తీవ్ర కృషి చేసిన పార్టీ నాయకుని అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశాడు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి. కనిగిరి మండలం అట్లవారిపల్లి మాజీ సర్పంచ్ అట్ల మల్లిఖార్జునరెడ్డి (44) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శు క్రవారం సాయంత్రం టిడిపి నేత స్వర్గీయ మల్లిఖార్జునరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో కూడా ఎమ్మెల్యే ఉగ్ర పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ఆయన వెంటే ఉంటూ అడ్డరోడ్డులో ఉగ్ర వీరాభిమానిగా ఉండడంతో పాటు ఆయన గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. అటువంటి (తరువాయి 4లో...)



# సిఎం చంద్రబాబునాయుడును కలిసిన ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దామచర్ల ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ, నల్లవాగు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, కొత్తపట్నం బీచ్ రోడ్డుకు నిధులు కేటాయించాలని కోరారు. కార్పొరేషన్ కి రావాల్సిన నిధులు త్వరగా మంజూరు చేయాలని విన్నవించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి కి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు.

# వైవీ పిఏ అకౌంట్ లోకి అన్ని కోట్లు ఎలా వచ్చాయి

## వైవి హయాంలోనే కల్తీ నెయ్యి స్కాం
## చైన్ లింక్ అంతా వాళ్ల చుట్టూనే తిరుగుతుంది
## దేవుడి విషయంలో తప్పు ఒప్పుకొని, బాధ్యత వహించాలి
## టీటీడీ కల్తీ నెయ్యి స్కాం పై మంత్రి డోలా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

ఆయన పిఏ అకౌంట్ లోకి అన్ని కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వైవి సుబ్బారెడ్డిని ప్రశ్నించారు. ఒంగోలులో శుక్రవారం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైవి సుబ్బారెడ్డి టీటీడీ పాలకవర్గం చైర్మన్‌గా ఉన్న సమయంలో కల్తీ నెయ్యి స్కామ్ జరిగిందనేది వాస్తవం అన్నారు. దీనిని సిట్ విచారణ జరుగుతుందన్నారు. (తరువాయి 4లో...)



# పాము కాటుకు యువకుడు మృతి

**అయ్యప్ప దీక్షలో ఉండగా చల్లగిరిగల వద్ద ఘటన**
**చికిత్స అందించినా దక్కని ప్రాణాలు**



(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 21) మండలంలోని అక్కచెరువు గ్రామానికి చెందిన యువకుడు భోగాని సురేష్ (25) పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సురేష్ తన బంధువుతో కలిసి బుధవారం సిఎస్‌పురం మండలం భైరవకోనకు వెళ్లారు. అక్కడ పూజా కార్యక్రమాలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో అదే రోజు రాత్రి కనిగిరి మండలం చల్లగిరిగల వద్ద ఉన్న శివాలయంలో బస చేసిన సమయంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే గుర్తించిన స్థానికులు సురేష్‌ను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందారు. కనిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి పంచనామా అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు.

# గుడిపాటిపల్లి పంచాయతీలో సర్పంచ్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాల ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, నవంబర్ 21) మండలంలోని గుడిపాటిపల్లి పంచాయతీలో సర్పంచి కటికల రిబ్కా వెంకటరత్నం ఆధ్వర్యంలో గ్రామం పరిధిలోని గోపసముద్రం, శ్యామలవారిపల్లి, ఎస్సీ కాలనీ, గుడిపాటిపల్లిలో విద్యుత్ మరమ్మత్తులు చేసి నూతన విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల అవసరాల దృష్ట్యా బల్బులు ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కటికల అశోక్, డిక్షన్, క్లింటన్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర పథకాల అమలులో బ్యాంకులు చురుకుగా సహకరించాలి

**మునిసిపల్ కమీషనర్ పి కృష్ణ మోహన్‌రెడ్డి**



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 21) కేంద్ర, రాష్ట్ర పథకాల అమలులో బ్యాంకులు చురుకుగా సహకరించాలని మునిసిపల్ కమీషనర్ పి కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కనిగిరి పురపాలక సంఘం కార్యాలయంలో మెప్మా, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పీఎం స్వనిధి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పొదుపు గ్రూపులకు సంబంధించి లోన్ల రికవరీ గురించి బ్యాంక్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బ్యాంకర్లను కోరారు. మెప్మా సిఎంఎం ఎలిషా బాబు మాట్లాడుతూ పిఎం స్వానిది లోన్ల రికవరీ చేస్తామని, ప్రతి రోజూ లోన్లకు సంబంధిచిన వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంక్ సిబ్బంది సుదీర్, భరణి, కిరణ్, బాలు, మెప్మా సిఓలు ఎస్ రమణమ్మ, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య సంబంధ కార్యక్రమాలు విస్తృతం







త్వరలోనే ఫిషింగ్ హార్బర్ పనులు కూడా మొదలు పెడతామని చెప్పారు. మత్స్యకారులకు ఉపయోగపడేలా జెట్టీ కూడా కట్టామన్నారు. మత్స్యకారుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, డీజిల్ కు ఇస్తున్న సబ్సిడీని కూడా పెంచేలా ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ప్రకటించారు. మడనూరు – గుండమాల బీచ్ రోడ్డును సుందరంగా అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక మత్స్యకారులకు తమిళనాడు మత్స్యకారుల నుండి ఎదురవుతున్న సమస్యను పరిష్కరించేలా గత ఏడాదే ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ రాసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మత్స్యకారులకు ఇళ్ల స్థలాల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మేయర్ మాట్లాడుతూ మత్స్యకారులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కోసం అమలు చేస్తున్న పథకాలే దీనికి నిదర్శనం అని చెప్పారు. జి పేరయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఇస్తున్న సబ్సిడీని పెంచాలని కోరారు. రాయితీ డీజిల్‌ను 300 లీటర్ల నుంచి 600 లీటర్లకు పెంచాలని కూడా ఆయన అభ్యర్థించారు. ఆర్ వెంకట్రావు, శ్రీనిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ విజయరత్నం, పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ ఫిషరీస్ రంగంలో ఉన్న అభివృద్ధి అవకాశాలు, ప్రభుత్వం నుంచి కావాల్సిన తోడ్పాటును వివరించారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు మత్స్యకారుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల విలువైన బ్యాంకు చెక్కును ఈ కార్యక్రమంలో అతిధులు అందించారు. పదిమంది మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, ఐదుగురికి జిపిఎస్ సెట్లు, ఇద్దరికి పడవలు, ఇంజిన్లు, వలలను కూడా ప్రధానం చేశారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 21)





బాల్య వివాహాల రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యార్థినీలందరిపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక బాపట్ల పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగింది. "ప్రతి బిడ్డకు–ప్రతి హక్కు" అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యార్థినీల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాల్య వివాహాలు అడ్డుకున్న అంగన్వాడీ కార్యకర్తలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలంటే సామాజిక ఎదుగుదల చాలా ముఖ్యమని కలెక్టర్ చెప్పారు. బాగా చదవండి, సమాజంలో పరిస్థితులపై అవగాహన పెంపొందాలన్నారు. బాలల హక్కులు పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయన్నారు. దేశ రాజ్యాంగం మనకు స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించిందన్నారు. దేశం ఎదుగుదలలో చారిత్రాత్మకమైన అంశాలు మీ జీవితంలో గుర్తుంచుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధికి బాల్యవివాహాలు సమస్యాత్మకంగా మారాయన్నారు. వాటిని అరికట్టడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హక్కులపై అవగాహన లేకపోవడంతోనే సామాజిక ఎదుగుదల కనిపించడం లేదన్నారు. సామాజిక, ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేయాలని వారికి సూచించారు. కష్టపడి చదవండి, పోటీ ప్రపంచంలో మీ కాళ్ళపై మీరు నిలబడటం ముఖ్యమన్నారు. 18 ఏళ్లు దాటిన తర్వాతనే యువత పెళ్లి చేసుకోవడం చాలా మంచి పరిణామం అన్నారు. అప్పుడే మీ ఆలోచన పరిమాణం పెరుగుతుంది, అభివృద్ధిలోకి రాణించగలరన్నారు. నేను కూడా ప్రభుత్వ వసతి గృహంలోనే ఉంటూ ప్రభుత్వ కళాశాలలోనే చదువుకున్నానని మధుర స్మృతులను మననం చేసుకున్నారు. బాగా చదువుకోవాలని నా తల్లిదండ్రులు నిత్యం చెబుతూ ఉండే వారన్నారు. అలా మంచిగా చదివించే అవకాశం నాకు కల్పించడంతోనే మీ ఎదుట కలెక్టర్ గా నిలిచానన్నారు. తల్లిదండ్రులే మీ జీవితాలకు కూడా స్ఫూర్తి కావాలి, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి స్థాయికి ఎదగాలని కోరారు. బాలల హక్కుల సంరక్షణ కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ పనిచేస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి రాధామాధవి అన్నారు. బాగా చదువుకుంటేనే బాలలు ఉన్నతంగా ఎదగడానికి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో పురుషోత్తం, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని రాజదిబోరా, వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.





# వైవీ పిఏ అకౌంట్ లోకి అన్ని కోట్లు ఎలా వచ్చాయి

టీటీడీ చైర్మన్‌గా పనిచేసే వ్యక్తికి దేవునిపై నమ్మకం, భక్తి ఉండాలన్నారు. వైవి సుబ్బారెడ్డి తన హయాంలో జరిగిన స్కామ్‌ను ఒప్పుకొని, బాధ్యత వహించాలని హితవు పలికారు. సిట్ విచారణలో కల్తీ నెయ్యి స్కాం చైన్ లింక్ అంతా వైవి సుబ్బారెడ్డి చుట్టూనే తిరుగుతుందన్నారు. సిట్ వద్ద తగిన ఆధారాలు ఉంటే అరెస్టు చేస్తారని పేర్కొన్నారు. కల్తీ నెయ్యి స్కామ్‌లో ఎవర్ని వదిలేది లేదన్నారు.

# పార్టీ నాయకుని పాడె మోసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

నాయకుడు అకాల మరణం చెందడంతో ఎమ్మెల్యే ఉగ్ర కన్నీటిపర్యంతమయ్యారు. అంతే గాక మాజీ సర్పంచ్ మల్లిఖార్జునరెడ్డి పాడెను మోసి అతని పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ మల్లిఖార్జునరెడ్డి కుటుంబానికి తాను అండగా ఉంటానన్నారు. ఎవరైనా గుండెపోటు వస్తే గ్యాస్ సమస్య అని నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. మాజీ సర్పంచ్ అంత్యక్రియల్లో మాజీ ఎంపిపి పోతు కొండారెడ్డి, టిడిపి నాయకులు చెంచిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన డిఆర్ఓ చిన ఓబులేసు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

జిల్లా రెవెన్యూ అధికారి బిసిహెచ్ చిన ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిజీహెచ్ సుపరింటెండెంట్‌లతో కలసి శుక్రవారం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వసతులు, పారిశుధ్య ఏర్పాట్లను, డంపింగ్ యార్డ్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో రోగులకు అందిస్తున్న వసతులు, ఉన్న సైడు మురుగు కాలువల నిర్వహణ, పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి సూచనలతో శుక్రవారం జిజిహెచ్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వసతులు, పారిశుధ్య ఏర్పాట్లను, డంపింగ్ యార్డ్ నిర్వహణ, పరిశీలించడం జరిగిందని, దీని పై జిల్లా కలెక్టర్ వారికి నివేదిక ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సుపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు, జిజిహెచ్ వైద్యులు, తదితరులు ఉన్నారు.







# స్త్రీ పురుష సమానత్వ సాధనతోనే దేశ అభివృద్ధి సాధ్యం

## ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె శ్రీదేవి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు సమాన హక్కులు, సాధికారత కల్పించడం ద్వారానే సమాజం అన్ని రంగాల్లో ముందుకు పోయే అవకాశం ఉంటుందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె శ్రీదేవి అన్నారు. స్థానిక ఐద్వా జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. శిక్షణా తరగతులకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల ప్రిన్సిపల్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా పాలకులు మహిళా సాధికారతను కల్పించలేదని అన్నారు. ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా సమాజంలో ఉన్న మానవ శక్తినంతా వినియోగంలో తెచ్చుకోవాలని అన్నారు. సమాజంలో ఉన్న సగం మంది మహిళలకు విద్యా, ఉపాధి, పరిపాలన లాంటి అంశాల్లో అవకాశాలు లేకుండా చేస్తే సమాజం ఎలా అభివృద్ధి చెందుతుంది ఆమె ప్రశ్నించారు. స్వాతంత్రానికి పూర్వకాలం నుండే ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలుగా అనేక ఉద్యమాలు సాగుతున్నాయని ఆమె గుర్తు చేశారు. ఆ ఉద్యమాల ఫలితంగానే ఈ మేరకైనా మహిళలు కొన్ని హక్కులు సాధించుకోగలిగారని తెలిపారు. పురుషాధిపత్య భావజాలం, మత భావజాలం, విద్యా వ్యవస్థ ద్వారా, కుటుంబ వ్యవస్థ ద్వారా సమాజం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయని అన్నారు. ఈ భావజాలాలు సమాజంలో స్త్రీని రెండవ తరగతి పౌరురాలుగా, వంటింటికి పరిమితం చేసే సనాతన వాదాన్నీ మనిషి మెదడులోకి చొప్పిస్తున్నాయని అన్నారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి అత్యంత వేగంగా పెరుగుతున్నా, అంతరిక్షంలోకి మహిళలు కూడా వెళ్లి వస్తున్నా ఈ సనాతన సాంప్రదాయం మహిళలని పాతాళానికి తొక్కే ప్రయత్నాలు మాత్రం కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన రాజ్యాంగం సమానత్వాన్ని, సమాన హక్కులను కల్పించిందని, శాస్త్రీయ భావాలతో కూడిన ఆలోచన విధానం పెంపొందాలని రాజ్యాంగ




వేత్తలు ఆకాంక్షించారని అన్నారు. స్వాతంత్రోద్యమ అమరుల త్యాగాలు రాజ్యాంగ వేత్తల ఆశయాలను బిజెపి ప్రభుత్వం గడచిన 11 సంవత్సరాల కాలంలో తుంగలో తొక్కుతుందని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న మహిళా హక్కులు చట్టాలను నిర్వీర్యం చేసే విధంగా మోడీ పాలన సాగుతుందని అన్నారు. ఎనిమిది గంటల పని దినం స్థానంలో 13 గంటలకు పెంపొందించడంతోపాటు రాత్రిపూట కూడా మహిళలు పనిచేసే లాగా ప్రభుత్వాలు చట్టాలు చేయటం దుర్మార్గమని అన్నారు. సమాజంలో నిత్యం అనేక ఆకృత్యాలు పెరుగుతున్నాయని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, దాడులు పెరుగుతున్నా నిలువరించే చర్యలు ప్రభుత్వాలు తీసుకోకపోగా దోషులకు మద్దతుగా నిలబడుతున్నారని మండిపడ్డారు. సనాతన భావజాలం నర నారాన జీర్ణించుకున్న పాలకులు స్త్రీ సమానత్వాన్ని, హక్కులను హరించే విధానాల్ని అనుసరిస్తున్నారని ఆమె అన్నారు. మహిళలను చైతన్య పరచడం ద్వారా, ప్రజాతంత్ర వాదులతో కలిసి సమరశీల ఉద్యమాలు నిర్వహించటం ద్వారానే మహిళా సమానత్వం, సాధికారతను సాధించగలమని అన్నారు. అటువంటి ఉద్యమాలు దేశ అభివృద్ధికి దారి చూపుతాయని అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలుగా 1982లో ఏర్పడిన ఐద్వా మహిళా సంఘాలను ఐక్యం చేసి అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ మార్గంగా చూస్తున్నదని విచ్చలవిడి అమ్మకాలకు అవకాశాలు కల్పిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాలు, అనేక యాక్సిడెంట్లు, కుటుంబ హింస విపరీతంగా పెరగటానికి మద్యం ప్రధాన కారణంగా ఉందని ఆమె అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు హడావిడి తప్ప నివారణకు తగిన చర్యలు ప్రభుత్వాలు తీసుకోనందువలననే హింస, ప్రమాదాలు, దారుణాలు జరుగుతున్నాయని ఆమె అన్నారు. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకునే విధంగా మహిళా ఉద్యమాలు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాళ్ళు జి ఆదిలక్ష్మి, కె లక్ష్మీ ప్రసన్న, ఎస్కే నాగూర్ బి, కె రాజేశ్వరి, బి రాజ్యలక్ష్మి, బి పద్మ, కె ధనలక్ష్మి, పి రత్నం, ఖాధరున్నీసా, యస్ కె మస్తాన్ బి, పి ప్రేమలత, కె రత్తమ్మ, యస్‌డి అమీరున్నీసా, కె శాంతకుమారి, ప్రమీల, యస్‌డి రమీజ, తదితరులు పాల్గొన్నారు.

# ధార్తీ మాతా బచావో నిగ్రాణి సమితి ఏర్పాటు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి, నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి "ధార్తీ మాతా బచావో అభియాన్" (భూమి మాత రక్షణ కార్యక్రమం 5050) కార్యక్రమం కింద "ధార్తీ మాతా బచావో నిగ్రాణి సమితి" ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ రాజాబాబు అధికారులతో సమావేశమై ధార్తీ మాతా బచావో అభియాన్ (భూమి మాత రక్షణ కార్యక్రమం 5050) కార్యక్రమం విధివిధానాల పై సమగ్రంగా చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి, నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధార్తీ మాతా బచావో అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన విధంగా గ్రామ, సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో ధార్తీ మాతా బచావో నిగ్రాణి సమితి లను ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. రైతులు తమ పొలాల నేల పరిస్థితులను మెరుగుపరచడానికి, అలాగే అవసరం మేరకు ఎరువులను వివేకవంతంగా ఉపయోగించమని ప్రోత్సహించడం, రైతులకు పంపిణీ చేయబడిన నేల ఆరోగ్య కార్డు నేలలో సూక్ష్మ పోషకాల లోపాన్ని పరిష్కరించడంలో సహాయపడేలా ఈ కమిటీలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువై, వాటి అవశేషాలు మన ఆహారం ద్వారా మన శరీరం లోకి చేరుతున్నాయని, దానివలన కాన్సర్ వంటి పలు రకాల వ్యాధులకు మనం గురవుతున్నామని, కనుక ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గించాల్సిన అవసరం ఉందని, అందుకనుగుణంగా వ్యవసాయశాఖ అధికారులు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జెడి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ప్రకృతి వ్యవసాయ అధికారి సుభాషిణి, మార్క్‌ఫెడ్ అధికారి హరిక్రిష్ణ, జిల్లా సహకారశాఖ అధికారి శ్రీలక్ష్మి, ఫెర్టిలైజర్స్ డీలర్స్, తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 21)

భూ సమస్యలను రెవిన్యూ అధికారులు నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలపై సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో సమావేశం అయ్యారు. భూ సమస్యలపై నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. నిషేధిత భూములపై ఫిర్యాదులు వస్తే ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవిన్యూకి సంబంధించిన పూర్తి వివరాలు, దస్త్రాలు భద్రంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ అంశాల పై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, డిఆర్‌ఓ జి గంగాధర్ గౌడ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్‌డిఓలు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, మండల తహసిల్దార్లు, తదితరులు, పాల్గొన్నారు.

# పశువుల సంరక్షణ, రోడ్డు ప్రమాదాలపై అవగాహన

(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, నవంబర్ 21)

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం 2025లో భాగంగా పశువుల సంరక్షణ, రోడ్డు ప్రమాదాల పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కోవిలంపాడు, మిట్టపాలెం గ్రామాలలో పశువైద్య సహాయకురాలు అమృత సహకారంతో, గ్రామాలలోని గేదెలకు రేడియం మెడ బ్యాండ్‌లను విద్యార్థులు కట్టారు. జాతీయ రహదారి సమీపంలో రాత్రిపూట పశువుల మరణాలు పెరుగుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. పశువులను కాపాడుకోవడానికి రేడియం మెడ బ్యాండ్‌లను ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ బ్యాండ్‌లు డ్రైవర్లు చీకటిలో జంతువులను గమనించడానికి సహాయపడతాయని, ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# ఈవీఎం యంత్రాలు భద్రంగా ఉన్నాయి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్








(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 21)

ఈవీఎం యంత్రాలు భద్రంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈవీఎం గోదాములను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల అనుసరించి ఈవీఎం గోదాముల భద్రతను ఆయన పరిశీలించారు. సీసీ కెమెరాలు పని తీరుపై ఆరా తీశారు. పోలీసుల భద్రతను పరిశీలించారు. ఏలాంటి సమస్యలు రాకుండా భద్రత చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, తహసిల్దార్ సలీమా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, తదితరులు ఉన్నారు.

# ప్రజల కోసం...

# ప్రజలతోనే ప్రజాదర్బార్

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 21)

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అర్జీల రూపంలో అర్జీదారుల నుండి తీసుకున్నారు. ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్లీన్ ఇండియా - గ్రీన్ ఇండియా కార్యక్రమానికి టీడీపీ నేతల భాగస్వామ్యం





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, నవంబర్ 21)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు మండల పెద్దారవీడు మండలం, పెద్దారవీడు గ్రామంలో క్లీన్ ఇండియా - గ్రీన్ ఇండియా కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి జాన్ సుందరం ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పెద్దారవీడు మండల అధ్యక్షులు మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీను యాదవ్, మాజీ మండల అధ్యక్షులు గొట్టం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రగుంట్ల నాగేశ్వరరావు, వెన్నా బోడిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి జండా రవి, సర్పంచ్ రామకృష్ణరెడ్డి, ఆకుమల్ల శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, మల్లారెడ్డి, కొండారెడ్డి, పెద్ద కొండారెడ్డి, సుబ్బారెడ్డి, తిరుపాలు, వీరరెడ్డి, అలాగే అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. నాయకులు పలు వీధుల్లో స్వయంగా చీపుర్లు పట్టి శుభ్రపరిచారు. ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రంగా, పచ్చగా ఉంచుకోవాలని వారు పిలుపునిచ్చారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు

### జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా డ్రైవింగ్ లైసెన్స్, ఎల్.ఎల్.ఆర్. మంజూరు కోసం శుక్రవారం ఒంగోలులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌ల మంజూరులో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రీవెన్స్ లో పలువురు దివ్యాంగులు తెలిపారని, దీని పై స్పందించి ప్రత్యేకంగా ఈ శిబిరం ఏర్పాటు చేసామన్నారు. 59 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో రవాణా శాఖ సిబ్బంది ఆన్ లైన్ ద్వారా ఎల్ ఎల్ ఆర్, లైసెన్స్ స్లాట్ లను బుక్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సౌకర్యాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, రవాణాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి ప్రణాళికతో చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 21)

ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి ప్రణాళికతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై జిల్లా, మండలం, సచివాలయాల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. రైతుల పండించిన ధాన్యం సేకరించడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ చెప్పారు. వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతుల ఇళ్లకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఒక్కొక్కరు 30 ఇళ్లను ఎంపిక చేసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు వివరించాలన్నారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందనే విషయాలపై రైతులలో చైతన్యం తీసుకురావాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చక్కని ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆమేరకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో ఎన్ని ఎకరాలలో ధాన్యం పంట సాగు చేశారో, ఎంత ధాన్యం ఉత్పత్తి జరుగుతుందో.. ప్రణాళికల రూపొందించుకోవాలన్నారు. ఆర్ ఎస్ కే లకు ఏ రోజు ఎంతమంది రైతులు ధాన్యం విక్రయించడానికి వస్తారో ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో 2.16 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని ప్రాథమిక సమాచారం ఉందన్నారు. వారి కొరకు 117 ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. టార్పాలిన్ పట్టలు, గోనె సంచులు సిద్ధం చేసుకోవాలన్నారు. రైస్ మిల్లులు వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. రైతుల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ కల్టివేట్ యాప్ అమల్లోకి తీసుకురానున్నదని చెప్పారు. సాగు దిగుబడి లక్ష్యంతో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. రైతులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ కోసం ధాన్యం సేకరణ బృందాలు సిద్ధంగా ఉండాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట తెలిపారు. జిల్లాలో 260 ఆర్ఎస్ కె లు ఉన్నాయని, వాటిలో 117 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 60 తేమ



యంత్రాలు సిద్ధంగా ఉంచామని, 73 మిల్లులను ఎంపిక చేశామన్నారు. 13 లక్షల గోనె సంచులు ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేశామన్నారు. అవసరమైతే సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం తరలించే వాహనాలకు జిపిఎస్ అనుసంధానించాలన్నారు. అక్రమాలకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి అమీర్ బాషా, సంస్థ జిఎం శివపార్వతి, వ్యవసాయ శాఖ డిడి అన్నపూర్ణ, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్, ఆర్‌డిఓలు, మండల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కంభంలో రోడ్డు ప్రమాదాల ప్రాంతాలు పరిశీలన

### ప్రమాదాల నివారణకు

### జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాలు

(షణ్ముఖ వెలుగు, కంభం, నవంబర్ 21)

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు ఆదేశాల మేరకు, కంభం పట్టణంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకుంటామని, త్వరలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో కంభం సీఐ మల్లికార్జున, ఆర్ అండ్ బి (రోడ్లు, భవనాలు) అధికారులు, సంభందిత శాఖల అధికారులు చురుకుగా పాల్గొన్నారు. ప్రమాదాలకు గల కారణాలను, రోడ్డు నిర్మాణాలు, సిగ్నలింగ్ సమస్యలు, ట్రాఫిక్ నిర్వహణ లోపాలను అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. అధికారులు మాట్లాడుతూ, కలెక్టర్ మార్గదర్శకంలో ప్రజల భద్రతే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల దీర్ఘకాలిక చర్యలను వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు, ఏర్పాటు చేయడంతో పాటు, రోడ్డు మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అలాగే ఈమధ్య కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా కందులాపురం సెంటర్ కూడలి, ఫ్లై ఓవర్, రావిపాడు రోడ్డు, వై జంక్షన్, యూ టర్న్ దగ్గర ఎక్కువగా జరిగినట్లు గుర్తించామని ఒకరకంగా ఫుట్పాత్ ఆక్రమించడం కూడా ఒక కారణంగా కనుగొన్నామని తొందరలోనే ఫుట్ పాత్ ఆక్రమణలు కూడా తొలగించి రోడ్డు ప్రమాదాలకు అడ్డుకొనే విధంగా చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ తీసుకుంటున్న ఈ చొరవ పై పట్టణ ప్రజలు ఇప్పటికైనా అధికారులలో స్పందన వచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# కేరళ ప్రభుత్వం ఘోర వైఫల్యం

### డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

శబరిమల అయ్యప్పస్వామి ఆలయానికి ఏటా లక్షలాది భక్తులు దేశం నలుమూలల నుంచి అడుగు పెడుతుంటారు. అయితే ప్రతి సంవత్సరం యాత్రా కాలంలో ఏదో ఒక రూపంలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి కొనసాగుతుండటం అత్యంత విచారకరమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తీవ్రంగా విమర్శించారు. నాస్తిక వామపక్ష ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యపూరిత వైఖరి కారణంగానే ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ఆయన మండిపడ్డారు. భక్తుల సౌకర్యం, భద్రత, ప్రాథమిక వసతులు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు వంటి అత్యవసర అంశాల్లో పూర్తిగా వైఫల్యం చోటుచేసుకోవడం భక్తులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందని ఏలూరి పేర్కొన్నారు. అయ్యప్పస్వామిపై భక్తుల్లో ఉన్న భక్తి భావోద్వేగాలను గౌరవించడం ప్రభుత్వ ధర్మమని, కానీ వామపక్ష ప్రభుత్వం మాత్రం పరిపాలనా లోపాలు, అనాలోచిత నిర్ణయాలు, సమన్వయం లేకపోవడం ద్వారా శబరిమల యాత్రను కష్టసాధ్యంగా మారుస్తోందని అన్నారు. సానిటేషన్, క్యూలైన్ నిర్వహణ, వసతి, రద్దీ నియంత్రణ వంటి అంశాల్లో ముందుగానే అవసరమైన చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. శబరిమల వంటి ప్రాచీన, పవిత్రమైన దేవస్థానానికి వచ్చే యాత్రికులపై ఇలాంటి నిర్లక్ష్యం అనవసరమైన గందరగోళాన్ని, ప్రమాదాలను పెంచుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పరిస్థితిని సమీక్షించి, భక్తుల కోసం సమగ్ర చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజలను ఆరోగ్యవంతంగా మారుస్తాం



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, నవంబర్ 21)

జ్వరాలు లేని సంపూర్ణ ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని, సురేంద్రనగర్ యుపిఎస్సి వైద్య అధికారి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సురేంద్ర నగర్, తిరువెంగళపురం లలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లెప్రసీ, లార్వా, ఫీవర్ ,ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. రాగి మచ్చలు స్పర్శ లేనట్లయితే కుష్టి వ్యాధిగా గుర్తించాలన్నారు. ప్రథమ దశలోనే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చున్నారు. సబ్ యూనిట్ అధికారి టి నరసింహా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ప్రతి స్కూల్ ను విజిట్ చేసి ,శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దోమతెరలను వాడటం వలన దోమలను పూర్తిగా అరికట్టవచ్చు అన్నారు. పాఠశాలలో వంట రూములను పరిశీలించి, వారికి శుభ్రత పై అవగాహన కల్పిస్తూ, విద్యార్థులను నాణ్యమైన భోజనాలను అందించేటట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు, సిహెచ్ఓ హర్షిత, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనాథ బాల, బాలికలకు నిత్యవసరాలు అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

శ్రీ విశ్వ వికాస భారతి సేవా సంస్థ వారు బొమ్మరిల్లు అనాథ బాలబాలికలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సేవలో శ్రీ విశ్వ వికాస భారతి సేవా సంస్థ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పోతులూరి శివబ్రహ్మాచార్యులు, అధ్యక్షులు అద్దేపల్లి శివరామరాజు, కోశాధికారి జంపని శివానంద్ కుమార్, బొమ్మరిల్లు నిర్వాహకులు రాజ్యలక్ష్మీ, ఖాశీం, తదితరులు పాల్గొన్నారు. సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

# పొదిలి తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 21)

ఎపి యన్‌జిఓ అసోసియేషన్ పొదిలి తాలూకా యూనిట్ ఎన్నికల నామినషన్ల ప్రక్రియ శుక్రవారం పొదిలి ఎన్‌జీవో సంఘ భవనంలో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు పరచగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి, కంభం తాలూకా అధ్యక్షులు వి రాధాకృష్ణమూర్తి ప్రకటించారు. ఈ ఎన్నికలలో పొదిలి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ సభ్యులు, అధ్యక్షులు ఎల్ శ్రీనివాసరెడ్డి, యంపిహెచ్ఎ, యుపిహెచ్‌సి, పొదిలి సహాధ్యక్షులు యస్ కె నాసర్ వలి, డిప్యూటీ యంపిడిఓ, మర్రిపూడి ఉపాధ్యక్షులు షేక్ కరిముల్లా సీనియర్ అకౌంటెంట్, సబ్ ట్రెజరీ, పొదిలి, షేక్ అబ్దుల్ ఆరిఫ్, పంచాయితీ సెక్రటరీ, కెల్లంపల్లి, జె వెంకటేశ్వర్లు, యంపీహెచ్ఎ, పిహెచ్‌సి, గొట్లగట్టు, యస్‌కె యూసుఫ్, సీనియర్ అసిస్టెంట్, వ్యవసాయశాఖ, పొదిలి, ఉపాధ్యక్షురాలు (మహిళ) పి కళా ప్రపూర్ణ, సీనియర్ అసిస్టెంట్, అర్ డబ్ల్యు యస్ డివిజన్, పొదిలి, కార్యదర్శి షేక్ సందాని బాష, రికార్డ్ అసిస్టెంట్, జడ్ పి హై స్కూల్, ఉప్పలపాడు, కార్య నిర్వాహక కార్యదర్శి బి శ్రీనివాసరావు, ఫార్మసీ ఆఫీసర్, పి హెచ్ సి కాకర్ల, సంయుక్త కార్యదర్శులు వివి నరసారెడ్డి, యం పి హెచ్ ఏ, పిహెచ్‌సి, కొనకనమెట్ల, షేక్ గౌసియా జూనియర్ అసిస్టెంట్, హైస్కూల్, గొట్లగట్టు, యం రమేష్, వి అర్ ఓ, పొదిలి, కెవి అనిల్ కుమార్, విఅర్‌ఓ, సూదనగుంట, సంయుక్త కార్యదర్శి ( మహిళ) కె రమాదేవి, యం పి హెచ్ ఎ(మహిళ), యు పి హెచ్ సి, పొదిలి, కోశాధికారి కె విజయ, యంపిహెచ్ఎ (మహిళ), యుపిహెచ్‌సి, పొదిలి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కె రవి శంకర్, రికార్డ్ అసిస్టెంట్, హై స్కూల్, కాకర్లలు ఏక్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వి రాధాకృష్ణ మూర్తి ప్రకటించారు. ఈ ఎన్నికల కు సహాయ ఎన్నికల అధికారిగా కంభం తాలూకా యూనిట్ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా సంయుక్త కార్యదర్శి బి విజయ్ కుమార్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కంభం తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు, జిల్లా కార్యదర్శి అర్‌సిహెచ్ కృష్ణారెడ్డి లు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె శివ కుమార్, జిల్లా సహాధ్యక్షులు యం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి రామాంజనేయులు, మార్కాపురం అధ్యక్ష, కార్యదర్శులు బి శ్రీనివాస శాస్త్రి, జె రవికిరణ్, కనిగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు పి రమణారెడ్డి, దర్శి తాలూకా యూనిట్ అధ్యక్షులు జి శ్రీనివాసరావు, కార్యదర్శి బిజెఎస్ హెరాల్డ్, తదితరులు పాల్గొన్నారు.



# కొత్త సింగరభట్లపాలెంలో థీమ్ 5 పై శిక్షణ




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, నవంబర్ 21)

మండలంలోని కొత్త సింగర బొట్లపాలెం గ్రామంలో శుక్రవారం థీమ్ 5 పై ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ పంచాయతీల్లో పచ్చదనం పరిశుభ్రతకు ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండలంలో ఒక పంచాయతీ ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్ది దాన్ని మోడల్ గా చూపి మిగిలిన గ్రామాలను తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం అన్ని వీధులు ,రహదారులు, బస్టాండ్, స్కూల్స్ దేవాలయం, వాటర్ ట్యాంకులు ,పబ్లిక్ పేస్లను 56 మంది గ్రీన్ అంబాసిడర్‌లతో అన్ని చెత్తకుప్పలను శుభ్రంగా తొలగించి, బ్లీచింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, డిప్యూటీ ఎంపీడీవో సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రామ నాయకులు జి రమణారెడ్డి, కే రాఘవరెడ్డి, ధనకోటిరెడ్డి, సిహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, అంగన్వాడి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.







# భోగనంపాడులో స్వామిత్వ గ్రామసభ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, నవంబర్ 21)

మండలంలోని భోగనంపాడు గ్రామంలో శుక్రవారం సచివాలయంలో ఎంపీడీవో డాక్టర్ పి సుజాత అధ్యక్షతన స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో గ్రామంలో ఉన్న 924 పిపిఎంలలో ఎంపీడీవో సమక్షంలో 324 పిపిఎంలు చదివి వినిపించారు. సుజాత మాట్లాడుతూ పిపీఎంల అభ్యంతరాలను, అనుకూలతను రిజిస్టర్లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ బి సత్యకుమార్, గ్రామ నాయకులు పిల్లి వెంకట్ నారాయణరెడ్డి, డి వెంకటేశ్వర్లు, బ్రహ్మారెడ్డి, సుబ్బారావు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు

## జీఎంసీ ఒంగోలులో నిర్వహణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

ప్రభుత్వ మెడికల్ కాలేజ్, ఒంగోలు మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 18 నుండి 24 వరకు ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవగాహనా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది థీం యాక్ట్ నౌ ప్రొటెక్ట్ అవర్ ప్రజెంట్, సెక్యూర్ అవర్ ఫ్యూచర్‌గా నిర్ణయించబడింది. ప్రిన్సిపల్ డా. పి. అశోక్ కుమార్, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ మాణిక్యరావు మార్గదర్శకత్వం మరియు సహకారంతో, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కళాశాల నుండి ఆసుపత్రి వరకు ఒక భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్యాకల్టీ సభ్యులు, పీజీలు, యూజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారాంతంలో భాగంగా యాంటీబయాటిక్స్ బాధ్యతాయుత వినియోగం, పెరుగుతున్న ఏఎంఆర్ ప్రమాదాలు, వన్ హెల్త్ దృక్పథంతో దాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై పలు విద్యా సదస్సులు, ఇంటరాక్టివ్ కార్యక్రమాలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్లు, విద్యార్థులు, మరియు సాధారణ ప్రజల్లో ఏఎంఆర్ సమస్యపై అవగాహన పెంపొందించడం, భవిష్యత్తు తరాల ఆరోగ్య రక్షణలో ఇది కీలకమని అధికారులు తెలిపారు.

# జిల్లా అకాడమిక్ ఫోరం సభ్యులుగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య ఎంపిక



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 21)

గిద్దలూరు పట్టణానికి చెందిన రాష్ట్ర ఉత్తమ హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ పిచ్చయ్యను డిస్ట్రిక్ట్ అకాడమిక్ ఫోరం సభ్యులుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. కొమరోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లీనగరంలో హిందీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. విధినిర్వహణలో భాగంగా జిల్లాలోని పాఠశాలల విద్యా ప్రమాణాలను పర్యవేక్షించి మెరుగు పరచడం, ఉపాధ్యాయులకు ఉత్తమ బోధనా పద్ధతులను తెలియజేయడం, మూల్యాంకన ప్రక్రియలను పరిశీలించి మెరుగుపరచడం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి అభివృద్ధికి చర్యలు రూపొందించడం, క్లస్టర్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు సజావుగా జరిగేందుకు అవసరమైన సలహాలు ఇవ్వడం, పర్యవేక్షించిన విషయాలను జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపించారు.










# భక్తిశ్రద్ధలతో పోలి స్వర్గ పర్వదినం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)

పోలి స్వర్గ పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేటలో గల శివకేశవుల ప్రాంగణం, లోని చెరువుల వద్ద భక్తులతో శోభిల్లింది.ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున విశేషంగా మహిళలు సన్నిధికి చేరుకుని ప్రాంగణంలో గల కోనేరులో అరటిదొప్పలలో ఒత్తులను వెలిగించి భక్తిశ్రద్ధల నడుమ నీటిలో దీపాలను వదిలారు. పోలి స్వర్గం రోజున దీపాన్ని వెలిగించి నీటిలో వదిలితే, కార్తీక మాసమంతా దీపారాధన చేసిన పుణ్యం వస్తుందనే భావనతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దీపాలను నీటిలో వదిలి కార్తీక మాసానికి










## మందుబాబులకు జరిమానా




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)**

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉత్తర్వుల మేరకు విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 33 మందిని శుక్రవారం కోర్టు వారి వద్ద హాజరు పరచగా 33 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.3,30,000 జరిమానా విధించినారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ ఎస్ జగదీష్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, త్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ ఎంవీ యాక్ట్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

## మెప్మా స్కాంపై నిగ్గు తేలుస్తాం

**ప్రత్యేక కమిటీ ద్వారా గత ఆరున్నర సంవత్సరాలుగా జరిగిన లావాదేవీలు అన్ని బయటికి తీస్తాం**

**అవినీతికి పాల్పడిన ఎవర్ని వదిలేది లేదు**

**ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు**






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 21)**

మెప్మా స్కాం బయటికి తీసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎవరి హయాంలో జరిగిందో నిగ్గు తెలుస్తామన్నారు. స్కామ్‌లో కార్పొరేటర్లు ఉన్నా, ఎమ్మెల్యేలు ఉన్న, ఎంపీలు ఉన్న ఎవర్ని వదిలేది లేదన్నారు. గత ఆరున్నర సంవత్సరాల కాలంలో ఏఏ గ్రూపులో ఎవరు సభ్యులుగా ఉన్నారో, వారు ఏ బ్యాంకుల నుండి లోన్ తీసుకున్నారో వాస్తవాలను కమిటీ బయటపెడుతుందన్నారు. ఈపాటికి స్కామ్ గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయామన్నారు.

# నాయకత్వం, నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి

**అప్పుడే జీవితంలో రాణించి విజయాలు సొంతం అవుతాయి**

**జిల్లా కలెక్టర్ వి వినోద్‌కుమార్**













**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 21)**

నాయకత్వం, నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తేనే జీవితంలో రాణించగలం, విజయాలు సొంతమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి కార్యక్రమం శుక్రవారం స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. ప్రజలకు విశేషంగా సేవలు అందించడానికే ఐఏఎస్ అధికారిగా పని చేయడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నానని కలెక్టర్ చెప్పారు. నా జీవితంలో ఇది చాలా ఉత్తమమైన ఘట్టం. ప్రజలకు ఏ విధంగా సహాయం చేయాలి, వారికి ఏం చేస్తే మేలు జరుగుతుందో భిన్నంగా ఆలోచించే తత్వంతో ముందుకు వెళ్తున్నాను. క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు మనం తీసుకునే నిర్ణయాలపైనే విజయం ఆధారపడి ఉంటుందనే విషయాలు తెలుసుకోవాలన్నారు. ఏ రంగంలోనైనా ఎదగడానికి ముందు క్రమశిక్షణ, నాయకత్వం, సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం విజయానికి పునాదులు లాంటివన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, బృందంతో కలిసి పనిచేయడం నేర్చుకోవాలన్నారు. అప్పుడే నాయకత్వ లక్షణాలు మరింతగా పెంపొందుతాయన్నారు. ఏ రంగంలోనైనా మీరు ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నప్పుడు విజయం సిద్ధిస్తే దానిని బృందానికి ఆపాదించాలన్నారు. అపజయం ఎదురైతే దానికి తానే బాధ్యత తీసుకోవాలన్నారు. మున్ముందు అలాంటి లోపాలు జరగకుండా చక్కని ప్రణాళిక, వ్యవహార శైలితో ముందుకు వెళ్తేనే మంచి నాయకులుగా ఎదగడం సాధ్యపడుతుందన్నారు. మీ లక్ష్య సాధనలో ముఖ్యమైన కార్యకలాపాలు స్వయంగా చేపట్టాలి, మిగిలి నవి మీ తదుపరి ఉన్న వారికి ఆ బాధ్యతను అప్పగించినప్పుడే సమాజంలో మంచి నాయకుడిగా ఎదగవచ్చన్నారు. బాధ్యతగా వ్యవహరించడం ప్రాధాన్యత అంశమని, మీ ముందున్న పనిలో ఫలితం కచ్చితంగా విజయమే లక్ష్యంగా ఉండాలన్నారు. మీ ఆలోచనలు భిన్నమైన విధానంలో ఉండాలంటూ విద్యార్థులలో స్ఫూర్తి నింపారు.

### ఓ ఘటన ఎంతో బాధ కలిగించింది

సమాజానికి నా వంతు కృషి చేయాలి, ప్రజలకు సేవ చేయాలనే అంకిత భావంతో ముందుకు వెళుతున్నానని కలెక్టర్ వినోద్ కుమార్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దాదాపు ఒక గంట పాటు విద్యార్థులతో ప్రశ్నోత్తరాలతో ముచ్చటించారు. మొదట శాస్త్రవేత్తను కావాలనుకున్నా... వైద్యుడిగా పట్టభద్రుడనై... తర్వాత ఐఏఎస్ అధికారిగా నిలిచాను. చదువులో 94 శాతం ఉత్తీర్ణతతో ముందుకు వెళ్లాను. ఇంటర్మీడియట్ బయాలజీలో 99.9 మార్కులు సాధించి భారత దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకం, అవార్డు, రూ.20వేల నగదు బహుమతి సాధించాను. ఇంటర్మీడియట్లో 97శాతం మార్కులు వచ్చాయి. మెడికల్ సీట్ కొరకు పరీక్ష రాస్తే దేశంలో 80 ర్యాంక్ సాధించి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని వాణి విలాస్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ వైద్య కళాశాలలో సీటు సంపాదించి గైనకాలజిస్ట్ గా పట్ట భద్రుడనయ్యాను. అదే కళాశాలలో నెల రోజులు ఇంటర్న్ షిప్ (తాత్కాలిక ఉద్యోగం)లో వైద్యుడిగా పనిచేస్తూ కేవలం 20 రోజుల్లోనే 97 కాన్పులు సమర్ధంగా చేయగలిగాను. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఎంతో ఆసక్తితో ఉద్యోగంలో చేరితే మారుమూల గ్రామీణ ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చారు. నాకు సామర్థ్యం ఉన్నప్పటికీ నెల రోజులు ఎలాంటి ఆపరేషన్లు చేయకుండా ఉండడమే నాకు చాలా బాధ కలిగించింది. వెంటనే సివిల్స్ కు సిద్ధమయ్యాను.

తొలి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించాను. నెల్లూరు జిల్లా సంయుక్త కలెక్టర్ గా విధులు నిర్వహిస్తుండగా కోవిడ్ సమయంలో 200 మంది వైద్యులను రిక్రూట్ చేయడం నాకు ఎంతో సంతోషం కలిగింది. ఎంతో అందమైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పనిచేయడం నాకు ఓ బంగారు అవకాశంగా భావిస్తున్నాను. ప్రకృతిలో సహజ వనరులు ఉన్న బాపట్లలో పనిచేయడం నాకేంతో ఆనందంగా ఉంది. నాకు చాలా పెద్ద కుటుంబం ఉంది... అది బాపట్ల జిల్లా కావడం గొప్ప భాగ్యమేనన్నారు. ప్రజలకు ఏం చేయాలి, ఎలాంటి సేవలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారో... నేనెలా వారికి మేలు చేయాలో, మంచి సేవలందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నానన్నారు. క్రమశిక్షణ, చిత్తశుద్ధి, నిబద్ధతకు మారుపేరుగా ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల నిలిచిందని కలెక్టర్ చెప్పారు.

స్వాతంత్రానికి ముందే నెలకొల్పి, దేశంలోనే ఎంతో ప్రాచుర్యం పొందిన ఇలాంటి చారిత్రాత్మకమైన కళాశాలలో విద్యార్థులతో మాట్లాడటం నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. జీవితంలో ఎదగడానికి క్రమశిక్షణ చాలా ముఖ్యమని కేరళ విద్యార్థిని కి కలెక్టర్ సమాధానమిచ్చారు. క్రమశిక్షణ జీవితంలో ఒక వస్తువులాంటది, సూక్ష్మ ప్రణాళిక లేకపోతే మంచి భవిష్యత్తుకు ఎన్నో వందల తప్పులు నిరోధకంగా మారే అవకాశం ఉందన్నారు. ఐఏఎస్ అధికారి అవడానికి మీరు ఎంత సమయం కేటాయించారు.

**నేను ఐఏఎస్ అధికారి కావాలని కోరిక ఉంది. ఎలా చదవాలి? – రమ్య**

కలెక్టర్ సమాధానం... దేశం, రాష్ట్రాన్ని ప్రకృతిని ప్రేమించడం అలవాడాలి. ప్రజలకు ఎలా నా సేవలు అందించాలని ఆలోచన ఉండాలి. కుటుంబ సభ్యులు, అధ్యాపకుల మాటలే మనకు స్ఫూర్తి నింపుతాయి. మొదట వారి ఆలోచనలు సూచనలు గ్రహించడం ముఖ్యం. అన్ని సబ్జెక్టులులో పట్టు సాధించడం, ప్రతిరోజు పత్రికలు చదవడం అలవాటుగా మారాలన్నారు. పోటీ పరీక్షలలో హాజరై మన సామర్థ్యాన్ని నిరంతరం మెరుగుపరచుకోవాలి. కనీసం 8 గంటలు ఏకాగ్రతతో చదవడం మీ జీవితంలో లక్ష్యం కావాలి. అప్పుడే ఐఏఎస్ కు అడుగులు పడతాయి.

**ఐఏఎస్ విజయం సాధించడం ఎలా వీలయ్యింది? అందులోనూ మీకు కష్టమైన ప్రశ్న ఏమిటి? – వైష్ణవి**

కలెక్టర్ సమాధానం... ప్రభుత్వ ఉద్యోగానికి లక్షల మంది పోటీపడతారు. ఐఏఎస్ అధికారి కావాలంటే కేవలం దేశానికి కేవలం 25 సీట్లే ఉంటాయి. మన కోరిక, లక్ష్యం గొప్పగా ఉండాలి. అది నిజం కావడానికి దృఢ సంకల్పంతో చదవాలి. నిబంధత, నిక్కచ్చిగా ఐఏఎస్ సీటు సాధించడం జీవితానికి ఒక లక్ష్యం ఒకే ఆలోచన ఉండాలి. ఐఏఎస్ పూర్తయ్యాక 201 మార్కులు సాధించి ఐఏఎస్ అధికారిగా దేశంలోనే నాలుగు స్థానంలో నిలిచానని తన అనుభవాలను పంచుకున్నారు.

**ఐఏఎస్ కావాలని మీ లక్ష్యం ఎందుకు ఎంచుకున్నారు? –లక్ష్మీ అపర్ణ**

కలెక్టర్ సమాధానం... ప్రజలకు మంచి సేవ చేయాలని ఐఏఎస్ అధికారిని కావాలనుకున్నాను. లక్ష్యం స్పష్టంగా ఉంది అందుకే జీవితంలో ఎదురయ్యే పరిస్థితులన్నీ పాజిటివ్ గానే తీసుకున్నాను. ఎక్కడ పని చేసిన పాజిటివ్ ఆలోచనలతోనే ముందుకు సాగాలి. మనం తీసుకునే నిర్ణయాలు చాలా ముఖ్యం. అవే మన ఉన్నతమైన జీవితాన్ని తీర్చిదిద్దుతాయి.

**ప్రజల అధికారిగా ఎదగాలంటే ఏం చేయాలి? మీ దృష్టిలో ఏది గొప్పగా భావిస్తున్నారు? కిరణ్, కాకినాడ**

కలెక్టర్ సమాధానం... ఏ రంగంలోనైనా నాయకుడిగా ఎదగడం చాలా ముఖ్యం. మనం తీసుకునే నిర్ణయాలు నాయకుడుగా సమాజంలో నిలబడుతుంది. ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నప్పుడు, విజయం సిద్ధిస్తే దానిని బృందానికి ఆపాదించాలి. అపజయం ఎదురైతే దానికి తాను బాధ్యత తీసుకోవాలి. ఇలాంటి వ్యవహార శైలి తోనే నాయకులుగా ఎదగడం సాధ్యపడుతుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి ప్రసన్నారాణి, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మార్కాపురం డివిజన విద్యాశాఖాధికారి ఎం శ్రీనివాసరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 21)**

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్కాపురం డివిజన్, విద్యాశాఖాధికారి ఎం శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించి తరగతి వారీగా విద్యార్థుల విద్యాస్థాయిని తెలుసుకున్నారు. పాఠశాలలోని గ్రంథాలయంలో గల వివేకా పఠనాలయమును సందర్శించి అందులోఉన్నపుస్తకాల అమరికను, వినియోగమును గురించి విద్యార్థిని, విద్యార్థులు రోజూ పుస్తకాలను చదవడం వల్ల మన నిత్య జీవితంలో అవి ఏ విధంగా ఉపయోగపడతాయో, వాటి ఆవశ్యకతను విద్యార్థిని, విద్యార్థులకు నిశితంగా వివరించారు. పాఠశాలలోని భౌతిక, రసాయనిక శాస్త్రాల ప్రయోగశాలను, క్రీడా విభాగాలను పరిశీలించి ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం సుధాకర్ ఉపాధ్యాయ బృందంతో గ్రామ పెద్దలతో చర్చా గోష్టి నిర్వహించి పాఠశాలలో వజ్రోత్సవ కార్యక్రమాన్ని భారీ ఎత్తున ఏర్పాటు చేసేందుకు కావలసిన భౌతిక వనరుల సమీకరణ తోడ్పాటు సహకరించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందాన్ని, పాఠశాల పూర్వ విద్యార్థులను ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. పాఠశాలలో వజ్రోత్సవ సందర్భంగా భౌతిక వనరులు, మౌలిక వసతులను పరిశీలించి ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ పాఠశాల అభివృద్ధి కొరకు కావాల్సిన ఆర్థికవనరులు ఇతర సంస్థల నుండి సహకారం పొందేందుకు తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలలో ప్రభుత్వం కల్పించిన మధ్యాహ్న భోజనం పథకాన్ని గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని వారితో పాటు భోజనం చేయడం జరిగింది. రుచికరంగా ఇంటి తరహా భోజనంలా తయారు చేసి విద్యార్థులకు అందిస్తున్న వంట మనుషులను కూడా ఆయన అభినందించారు. ఈయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com